క్లుప్తంగా

తెలంగాణ మద్యం బాటిళ్ల స్వాధీనం

మంగళగిరి: తెలంగాణ మద్యం బాటిళ్లను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. మిద్దె సెంటర్‌లో తెలంగాణ మద్యం విక్రయిస్తున్న పుల్లా ఎల్లయ్య, పూజల గంగాధర్, మాచర్ల శ్రీనివాసరావులను అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిర్మలా ఫార్మసీ కళాశాలలో ఆటల పోటీలు



మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మలా ఫార్మసీ కళాశాలలో నిర్మలా ప్లే ఆఫ్-2023 కార్యక్రమంలో భాగంగా మూడు రోజులుగా ఆటలపోటీలు నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, త్రోబాల్, రన్నింగ్, కోకో, డ్యాన్స్, రంగోలి, క్విజ్, డ్రాయింగ్, షార్ట్‌ఫిలిం, షార్ట్‌పుట్, చెస్ పోటీలు నిర్వహించినట్లు కోఆర్డినేటర్లు డాక్టర్ పాములరెడ్డి తెలిపారు. విజేతలకు గురువారం బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు మంజుల, సౌజన్య, జోజిబాబు, స్పందన, కళాశాల ప్రెసిడెంట్ సిస్టర్ మరియ సుందరి, కార్యదర్శి సిస్టర్ నిర్మల జ్యోతి పాల్గొన్నారు.

వైభవంగా కూడారై ఉత్సవం




ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో గోదారంగనాథ స్వామి వారికి గురువారం పాశురాన్ని పురస్కరించుకొని కూడారై ఉత్సవం నిర్వహించారు. అర్చకులు రాజేంద్రశర్మ ఆధ్వర్యంలో గోదా రంగనాథస్వామివార్లకు అష్టోత్తర, సహస్త్ర నామ పూజలు చేశారు. భక్తులు తీసుకొనివచ్చిన 108 గంగాళాల్లో పాయసాన్ని స్వామివార్లకు నివేదించారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. గీతభజన మండలి ఆధ్వర్యంలో గోదాదేవి పాశురాలు గానం చేశారు.

ముగ్గు రోడ్డు నిర్మాణం పూర్తి



తాడేపల్లి రూరల్: మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ముగ్గురోడ్డు పాత జాతీయ రహదారి నుంచి ఉండవల్లిలో పంట పొలాల్లో ఉన్న నివాసాలకు గురువారం గ్రావెల్ రోడ్ నిర్మాణాన్ని ఎంటీఎంసీ అధికారులు పూర్తి చేశారు. ఆ ప్రాంతంలో 30 ఏళ్ల నుంచి నివాసాలు ఉన్నప్పటికీ ఒక్క రోడ్డు నిర్మాణం కూడా చేపట్టలేదు. పాత జాతీయ రహదారి నుండి కిలోమీటరు వరకు ప్రధాన రహదారిని నాలుగున్నర మీటర్లు నిర్మించారు. అలాగే ఆ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న మరో మూడు రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. గ్రావెల్ రోడ్లు ప్రజలు పూర్తికావడంతో ఆ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డితో పాటు కార్పొరేషన్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

చిలువూరులో క్రీస్తు సాక్షాత్కార మహోత్సవం



దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో గురువారం ఆర్‌సీఎం చర్చి ఆధ్యర్వంలో క్రీస్తు సాక్షాత్కార మహోత్సవం అంగరంగ వైభవంగా గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏలూరు పీఠాధిపతులు జయరాజు క్రీస్తుకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ కార్యక్రమానికి విచ్చేసిన క్రీస్తు భక్తులకు తమ సందేశాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు దివ్యబలిపూజ, తేరు ప్రదక్షిణ, బాణసంచా, మేళతాళాలతో మేరీమాతకు గ్రామోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిలువూరు చర్చి విచారణ గురువు చాట్ల మరియదాసు ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ జోజప్ప, ఫాదర్ జక్రయ్య, సహాయక గురువు పాపయ్య పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

తాడేపల్లి రూరల్: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఎంటీఎంసీ పరిధిలోని ఇప్పటంలో గ్రామ యువతీ యువకులు గురువారం వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు మున్నంగి వివేకానంద రెడ్డి మాట్లాడుతూ ఇప్పటంలో స్వామి వివేకానంద విగ్రహం ఏర్పాటుచేసి పార్కు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమని చెప్పారు. నేటి యువతీ యువకులు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు లచ్చి తులసీదాసు, వెంకటేశ్వర్లు, అమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, వీరంకి హరి ప్రసాద్ గౌడ్, చిన్నా పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

దుగ్గిరాల గ్రామంలోని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. దుగ్గిరాల శివాలయం సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా రామస్వామి యాదవ్ మాట్లాడుతూ 1893లో అమెరికాలోని చికాగో నగరంలో ప్రపంచ దేశాల మతగురువుల సమావేశంలో మన సనాతన హైందవ సాంప్రదాయాలను ఎలుగెత్తి చాటిన గొప్ప మహనీయుడు స్వామి వివేకానంద అని అన్నారు. అలాంటి మహనీయుని జయంతిని యువజనోత్సవంగా జరుపుకోవడం ఎంతో సంతోషించదగ్గ విషయమని, నేడు ఉన్న యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకుని వివేకానంద బోధనలు ప్రతి ఒక్కరికి వివరించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో దుగ్గిరాల వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు షేక్ సుభాని, సైమన్ కిషోర్, షేక్ జాన్, తాడిబోయిన వెంకట నారాయణ, చింతమనేని కోటయ్య, కాకాని ఆంజనేయులు, తాడిబోయిన నరసింహారావు, గుండు పాములు, మేకా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఇప్పటంలో వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



దుగ్గిరాలలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఈమనిలో....

దుగ్గిరాల మండల పరిధిలోని ఈమనిలో విలేజ్ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో స్వామి వివేకానందుని జయంతిని ఘనంగా నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ కె.కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ భరతమాత ముద్దుబిడ్డ వివేకానంద స్వామి జయంతిని జరుపుకుంటున్నామని, ఆయన భారతదేశ ప్రాముఖ్యతను ప్రపంచ నలుమూలలా చాటిచెప్పిన వ్యక్తి అని అన్నారు. అనంతరం 30 మంది బాలబాలికలకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఫోరం కన్వీనర్ ఇంగువ విష్ణుమూర్తి ఫోరం ప్రతినిధులు, గ్రామ పెద్దలు ముదిగొండ భవానీ శంకర్, అంబటి వెంకటేశ్వరరావు, గాయత్రి శివశంకర్, కె.శ్రీరామమూర్తి, కె.సుధాకర్ పాల్గొన్నారు.

మోటారు దొంగలతో రైతుల్లో ఆందోళన

తాడేపల్లి రూరల్: ఎంచక్కా అర్ధరాత్రి సమయంలో పంట పొలాల్లో మోటార్లు దొంగిలించే దొంగలకు 3 వేల రూపాయలు ఆదాయం రాగా, మోటారు పోగొట్టుకున్న రైతులకు 30 వేల రూపాయలు నష్టం వాటిల్లడంతో ఒక పక్క పంటనష్టాలు, మరో పక్క మోటారు చోరీలతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పెనుమాకలో గురువారం తెల్లవారుజామున రెండు మోటార్లు చోరీకి గురయ్యాయి. ఉదయం పంటకు నీరు పెడతామని వెళ్లిన మున్నంగి సోమశేఖరరెడ్డి, గుదిబండ శ్రీనివాసరెడ్డి మోటార్లు చోరీకి గురికావడంతో పోలీసులను ఆశ్రయించారు. గత తొమ్మిది నెలల క్రితం ఈ రైతులకు చెందిన మోటార్లు చోరీకి గురికావడంతో 30 వేల రూపాయలు పెట్టి ఇద్దరు రైతులు మళ్లీ మోటార్లు వేయించుకున్నారు. తిరిగి మరల పంట చేతికి రాకముందే మోటార్లు చోరీకి గురికావడంతో వ్యవసాయం ఎలా చేయాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పెనుమాకలో వరుసగా మోటార్లు చోరీకి గురికాగా అదే గ్రామానికి చెందిన ఉల్లిపాయల వ్యాపారి దొంగిలించినట్లు గుర్తించారు. ఆ వ్యాపారి పాత ఇనుప సామన్లు కొనే వ్యక్తికి 3 వేల రూపాయలకు అమ్మగా, ఆ మోటార్లను పార్టులుగా విడదీసి స్క్రాప్ కింద అమ్మేందుకు సిద్ధమయ్యారు. పోలీసులుకు ఉల్లిపాయల వ్యాపారి పట్టుబడడంతో ఆ మోటార్లను రికవరీ చేశారు. మంగళగిరి సబ్‌డివిజన్‌లో ఏదో ఒక ప్రాంతంలో మోటార్లు దొంగిలించబడుతూనే ఉన్నాయి. రైతుల పంటపొలాల్లో పోతున్న మోటార్లు పాత ఇనుప సామన్లు అమ్మేవారే కొనుగోలు చేస్తారు. పోలీసులు ఇటువంటి వారిపై దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

201 సర్వే నివాస దారులకు ఊరట

- 22ఎ ప్రొహిబిటెడ్ లిస్ట్ నుంచి తొలగించేందుకు సర్వే
- చొరవ చూపించిన ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లిలో 201 సర్వే నంబర్‌లో నివాస దారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కృషితో ఊరట లభించింది. 22ఎ ప్రొహిబిటెడ్ లిస్ట్ నుంచి తొలగించేందుకు సచివాలయం మరియు రెవెన్యూ కార్యాలయం నుంచి సర్వే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ వెనుక భాగం, సలాం హోటల్ సెంటర్, ముగ్గురోడ్డు, సంజీవ్ నగర్ తదితర ప్రాంతాల్లో 2011లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భూములను 22ఎ ప్రకారం ప్రొహిబిటెడ్ చేసింది. అప్పట్లో పొరపాటున తాడేపల్లిలోని పై ప్రాంతాల్లో ఉన్న రిజిస్ట్రేషన్ భూములను సైతం 22ఎ ప్రొహిబిటెడ్‌లోకి చేర్చబడింది. అప్పటి నుంచి ఆ ప్రాంతాల్లో నివాసముంటున్న సుమారు 800 కుటుంబాల వారు రిజిస్ట్రేషన్లు కాక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎంతోమంది తమ ఇళ్లల్లో ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసేందుకు వారి ఉన్న ఆస్తిని అమ్ముకునేందుకు రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో దళారులు చెప్పిన రేటుకు అమ్ముకుని తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ఆ ప్రాంతంలోని నివాస దారులు అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రం సమర్పించి తమ కష్టాలను విన్నవించుకున్నారు. గతంలో ఉన్న నాయకులు పట్టించుకోకపోవడంతో ఆ ప్రాంతంలో ఉన్న నివాసదారులు 12 సంవత్సరాల నుంచి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎట్టకేలకు మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే చొరవతో రెవెన్యూ సిబ్బంది 22ఎ ప్రొహిబిటెడ్‌ను తొలగించేందుకు సర్వే చేయడంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సర్వే చేస్తున్న గ్రామ సచివాలయ సర్వేయర్లు

పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణే ధ్యేయం

తాడేపల్లి రూరల్: రైల్వేలో 2004 నుంచి అమలవుతున్న నూతన పెన్షన్ స్కీమ్ రద్దు కోసం, పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ కోసం పోరాటాన్ని కొనసాగించాలని టీఆర్‌డీ బ్రాంచ్ విజయవాడ డివిజన్ సెక్రటరీ బూరా శ్యామ్‌బాబు అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని కృష్ణాకెనాల్ రైల్వే జంక్షన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ అనేది ఉద్యోగి సర్వీస్‌లో చెమటోడ్చి సంపాదించుకున్న చట్టబద్ధమైన హక్కు అని, గౌరవ ప్రదమైన జీవితం గడపడానికి పెన్షన్ చెల్లించడం సామాజిక బాధ్యత అని అన్నారు. అందుకు గాను సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, ఎన్ఎఫ్ఐఆర్‌లు, ఎన్‌పీఎస్ రద్దు మరియు ఓపీఎస్ పునరుద్ధరణ కోసం పూర్తిగా కట్టుబడి ఉన్నామని, వీటి కోసం చేసే పోరాటాల్లో రైల్వే కార్మికులు సంపూర్ణ మద్దతు అందించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో డిపో ఇన్‌చార్జి, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఎస్ఎం రెహమాన్, ఎస్ఎస్‌ఈ ధారావత్ బద్దూ, సంఘ్ నాయకులు పలుకూరి సుబ్బారావు, కట్టా వసంతరావు, టి.బి.జి.తిలక్, ఎస్.రాజారామ్, ఎస్.సురేష్‌బాబు, యూత్ వింగ్ నాయకులు ఎ.సోమశేఖర్, కె.అశోక్ పాల్గొన్నారు.



నినాదాలు సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు

పాలియేటివ్ కేర్‌పై అవగాహన

మంగళగిరి: పాలియేటివ్ కేర్(సాంత్వన చికిత్స)తో రోగుల నొప్పుల బాధలకు విముక్తి కలుగుతుందని యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ అనూష అన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఈనెల రెండో తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి పాలియేటివ్ కేర్(సాంత్వన చికిత్స) వైద్య చికిత్స శిక్షణ తరగతులకు మంగళగిరి గణపతినగర్‌కు చెందిన డాక్టర్ వైఎస్సార్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ అనూష హాజరై శిక్షణ పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో జిల్లా నుంచి ఐదుగురు వైద్యాధికారులు హాజరు కాగా గుంటూరు జిల్లాలో తెనాలి డివిజన్ నుంచి డాక్టర్ అనూష హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రోగులు దీర్ఘకాలిక వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతకర జబ్బులతో కీమో, రేడియేషన్ చికిత్స పొందుతున్న కాలంలో బాధాకరమైన నొప్పులతో రోగి బాధపడుతూ ఉంటారని, అలాంటి నొప్పుల బాధలను తగ్గించే పద్ధతుల గురించి సాంత్వన చికిత్స వైద్యంలో శిక్షణ పొందినట్లు తెలిపారు.



శిక్షణ పూర్తిచేసిన డాక్టర్ అనూషకు సర్టిఫికెట్ అందజేస్తున్న వైద్యాధికారులు

భూ రీసర్వేపై విస్తృత ప్రచారం



దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి గ్రామంలో భూ రీసర్వేపై తహసీల్దార్ మల్లేశ్వరి అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడా చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకాన్ని అమలు చేస్తోందని, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి అధికారులే మీ దగ్గరకు వచ్చి మీ భూముల కొలతలు వేసి బౌండరీ రాళ్లను ఏర్పాటు చేసి రైతులకు హక్కు పత్రాలను అందజేస్తున్నారని చెప్పారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమం చేపట్టిందని, ప్రజలు దీనిని ఉపయోగించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సర్పంచి అజీజూన్, పంచాయతీ కార్యదర్శి భవాని, గ్రామ రెవెన్యూ అధికారి సుందరరావు పాల్గొన్నారు.

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలి

ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి



తాడికొండ: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించే దిశగా ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద వాడికి పని కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని, పనులు చేసే ఉపాధి కూలీలకు తప్పనిసరిగా మౌలిక వసతులు కల్పించాలన్నారు. గ్రామాల్లో తక్షణ ప్రజా ప్రయోజన పనులను గుర్తించి సత్వరమే వాటిని కూలీలచే చేయించాలని సూచించారు. 2022–23 సంవత్సరానికి తాడికొండ నియోజకవర్గం పరిధిలో 6,80,998 పనిదినాలు కల్పించామని 2023–24 ఏడాదికి 8,53,814 పనిదినాలు కల్పించేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకెళుతున్నట్లు తెలిపారు.

తాడికొండ మార్కెట్ యార్డు చైర్మన్‌గా పూర్ణచంద్రరావు



తాడికొండ: తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా మండలంలోని ముక్కామల గ్రామానికి చెందిన చిమటా పూర్ణచంద్రరావును నియమిస్తూ మార్కెటింగ్ శాఖ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, వైస్ చైర్మన్‌గా మోతడక గ్రామానికి చెందిన బోయపాటి సాంబశివరావుతో పాటు 13 మంది సభ్యులతో కూడిన కమిటీని నియమించారు. సభ్యులుగా కలవకొలను మేరిమ్మ, బేతంచర్ల దుర్గ, షేక్ బాజీ, దొడ్డా తిరుమల, బాకి జ్యోతి, దాసరి రంగారావు, కొమ్మినేని రజని, జొన్నకూటి ప్రశాంత్ బాబు, యాకసిరి రమాదేవి, గుత్తా వెంకటేశ్వర్లు, మఖాం కమల, యడ్ల సాంబశివరావు, కొండా హరికృష్ణారెడ్డిలను నియమించారు. తాడికొండ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, పశు సంవర్ధక శాఖ ఏడీ, గ్రామ సర్పంచులు మెంబర్లుగా కమిటీ నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఈశ్వరసాయి ట్రస్ట్ సేవలు అభినందనీయం

ఫిరంగిపురం: డాక్టర్ చిట్టా ఈశ్వరసాయి ట్రస్ట్ ద్వారా సేవలు అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్ ఆవరణలో రేపూడి గ్రామానికి చెందిన డాక్టర్ చిట్టా ఈశ్వరసాయి పదో వర్ధంతి సందర్భంగా ఈశ్వరసాయి ట్రస్ట్, శంకర కంటి నేత్రాలయ, కొండవీటి ఈఎన్‌టీ(నరసరావుపేట)తులసీ హాస్పటల్(గుంటూరు) ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ప్రారంభించారు. డాక్టర్ చిట్టా ఈశ్వరసాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఈశ్వరసాయి భౌతికంగా లేకపోయినా ఆమెకు ఇష్టమైన వైద్యం ప్రజలకు అందించడం ద్వారా ఆమె ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడం అభినందనీయమని చెప్పారు. అనంతరం నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఈశ్వరసాయి ట్రస్ట్‌ద్వారా ప్రతి ఏటా వైద్యసేవలు వేలాదిమందికి అందించడం అభినందనీయమని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు , ఎమ్మెల్సీ డొక్కామాణిక్యవరప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ ఈశ్వరసాయి ఆశయాలకు అనుగుణంగా ఆమె తండ్రి బాపూజీరెడ్డి ప్రతి ఏటా వైద్యశిబిరాన్ని నిర్వహించడం ద్వారా ఆమె ఆత్మకు శాంతిచేకూరుతుందన్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెరసురేష్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఏటా ట్రస్ట్ ద్వారా వేలాదిమంది పేదవారికి వైద్యపరీక్షలు చేసి మందులు అందించడం మంచి పరిణామమన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టీనా పాల్గొని ఈశ్వరసాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం శంకరనేత్రవైద్యులు ఆధ్వర్యంలో రెండువేలమందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వీరిలో 120 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తి రేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ సోమశేఖరరెడ్డి, చిట్టా విజయభాస్కరరెడ్డి, బాపూజీరెడ్డి, ట్రస్ట్ చైర్మన్ భరద్వాజరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, డి.బాలయ్య పాల్గొన్నారు.



డాక్టర్ ఈశ్వరసాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

జాతీయ రహదారిపై ప్రమాదం



అండర్‌పాస్‌లో బోల్తా పడిన కారు

- రెండు బ్రిడ్జిల మధ్య నుంచి కిందకు దూసుకొచ్చిన కారు
- ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పాతూరు అండర్ పాస్ వద్ద గురువారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలు.. మంగళగిరికి చెందిన ధర్మతేజ విశ్వనాథరెడ్డి కారులో మంగళగిరి నుంచి విజయవాడ వెళ్తున్నారు. కారు అతివేగంగా నడపడంతో జాతీయ రహదారిపై పాతూరు అండర్ పాస్ వద్ద అదుపుతప్పి విజయవాడ– గుంటూరు వెళ్ళే రహదారికి గుంటూరు నుంచి విజయవాడ వచ్చే రహదారి మధ్య ఉన్న గోడలను గుద్దుకుంటూ రెండు బ్రిడ్జిల మధ్య 30 అడుగుల కింద అండర్ పాస్ లో కారు తలకిందులుగా పడిపోయింది ఈ సమయంలో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న తాడేపల్లి సీఐ సాంబశివరావు ఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం తాడేపల్లిలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో అండర్ పాస్‌లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.



గాయపడిన యువకులు

మార్కెట్ ఏరియా దుకాణంలో చోరీ

సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు

తెనాలి రూరల్: స్థానిక గాడిబావి సెంటర్‌లోని రాములు వారి గుడి వద్ద దుకాణంలో దుండగుడు చోరీకి పాల్పడిన ఘటన గురువారం తెల్లవారుజామున చేటుచేసుకుంది. వివరాలు.. గుడి కాంప్లెక్సులో నిర్వహిస్తున్న కొబ్బరికాయలలు, అగర్‌బత్తీల షాపులో దుండగుడు చోరీకి పాల్పడ్డాడు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో షాపు వద్దకు వచ్చిన దుండగుడు తాళాలు పగుల కొట్టి లోనికి ప్రవేశించాడు. అక్కడ ఉన్న సీసీ కెమెరాలు తొలగించి చోరీకి పాల్పడ్డాడు. సీసీ కెమెరాలను తొలగిస్తున్న దశ్యాలు అక్కడ రికార్డయ్యాయి. క్యాష్ కౌంటర్‌లోని నగదు చోరీ చేసి పరారయ్యాడు. ఉదయం షాపు వద్దకు వచ్చిన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా టూ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. కౌంటర్‌లో ఉంచిన సుమారు రూ.20 వేలు, రూ.10 వేల విలువైన పాత కరెన్సీ నోట్లు అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. దుండగుడు మాస్క్ వేసికొని కొట్టు తాళాలు పగలకొట్టి లోపలకి ప్రవేశించి మొదట సీసీ కెమెరాలు ఎక్కడ ఎక్కడ ఉన్నాయో గమనించి వాటిని తొలగించాడు. సీసీ కెమెరాలు తొలగించే సమయంలో మాస్క్ పెట్టుకొని ఉన్న అతడి ముఖం సీసీ కెమెరాలలో రికార్డ్ అయింది. దుకాణ నిర్వాహకుడు రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ, ఎప్పటిలాగే గత రాత్రి 10.30 సమయంలో కొట్టుకు తాళం వేసి ఇంటికి వెళ్లానని, ఉదయం దుకాణం తెరవటానికి వస్తే తాళాలు పగలకొట్టి ఉన్నాయని తెలిపారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సీసీ కెమెరాల్లో రికార్డయిన దుండగుడి కదలికలు

వైఎస్సార్ సీపీ విజయానికి బ్రహ్మారెడ్డి సేవలు ఎనలేనివి

కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ మండల అధ్యక్షుడుగా తియ్యగూర బ్రహ్మారెడ్డి చేసిన సేవలు వెలకట్టలేనివని పార్టీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. గురువారం గుంటూరులోని నియోజకవర్గ కార్యాలయంలో బ్రహ్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచి ప్రతిపక్షంలో మండలాన్ని ఒకే తాటిపై నడిపి నియోజకవర్గ విజయంలో కీలకమైన పాత్ర వహించిన బ్రహ్మారెడ్డి అకాలంగా మరణించినా ప్రజలల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతాడన్నారు.

కంతేరు గ్రామంలో..

తియ్యగూర బ్రహ్మారెడ్డి స్వగ్రామమైన కంతేరులో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బస్టాప్ కూడలితో పాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల వద్ద ఉన్న బ్రహ్మారెడ్డి విగ్రహాలకు సర్పంచి బెజ్జం మహేష్ బాబు, సొసైటీ అధ్యక్షుడు నంద్యాల సదానందరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.



గుంటూరు బ్రహ్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కత్తెర సురేష్ కుమార్